క్లుప్తంగా

పనుల్లో క్వాలిటీ లోపిస్తే బిల్లుల్లో కోత



పారుమంచాల్లో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కొలత లను సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

జూపాడుబంగ్లా: ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల్లో కోత విధిస్తామని క్వాలిటీ కంట్రోల్ డీఈ భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పారుమంచాల, పి.లింగాపురం గ్రామాల్లో నిర్మించిన సిమెంటు రోడ్లను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ నాణ్యతకు సంబంధించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఫలితాల్లో నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లకు మంజూరయ్యే బిల్లులో కోత విధిస్తామన్నారు. అనంతరం రోడ్ల కొలతలను సేకరించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బషీర్, క్వాలిటీ కంట్రోల్ ఏఈ అమర్‌నాథ్ ఉన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

పగిద్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో మంగళవారం క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ స్మార్ట్ కార్డులను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీరన్నయాదవ్, కాసీం సాహెబ్, వీఆర్వో రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మగ్రిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే తూతూ మంత్రంగా విడుదల చేసి చేతులు దులుపుకున్నారన్నారు. పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జబిబుల్లా, అబ్రార్, సమీర్, అభి, శివ, అబ్బు, అరవింద్ పాల్గొన్నారు.

సీఆర్‌పీలకు శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు ఏరియా కో ఆర్డినేటర్ ఎం.పుల్లయ్య ఆధ్వర్యంలో 9 మండలాల ఎఫ్ఎల్‌సీఆర్‌పీలకు ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు.

ఆధ్యాత్మికంతో మానసిక ఒత్తిడి దూరం

మహానంది: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడి దూరమవుతుందని నెల్లూరుకు చెందిన గీతా వైభవ్ ట్రస్ట్ చైర్మన్, గీతా ప్రభోదక్ షేక్ నజీర్ బాషా అన్నారు. మంగళవారం జినశంకర తపోవనంలో ఆధ్యాత్మిక బోధనల కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమం అధ్యక్షులు సంజీవ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు తీసుకోవాలి

మహానంది: వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని నంద్యాల జీఎస్‌టీఓ గాండ్ల సురేంద్ర సూచించారు. తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కేసు నమోదు

కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం గ్రామంలో పూజల విషయంలో సోమవారం జరిగిన ఘటనలో శ్రీనివాస ఆచారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ మంగళవారం తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్

పాములపాడు: మండల కేంద్రంలోని సత్రం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ మంగళవారం ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కాగా సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జీఓను రద్దు చేయాలి

నందికొట్కూరు: పదమూడు గంటల పరిధి నాల జీఓను రద్దు చేయాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



కొత్త ముచ్చుమర్రి ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాల్మీకి నాయకులు



నందికొట్కూరులో..



మోత్కూరులో..



శ్రీశైలం ప్రాజెక్ట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ బైరెడ్డి శబరి

మహోన్నతుడు వాల్మీకి మహర్షి



కొత్తపల్లిలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి నెట్‌వర్క్: వాల్మీకి మహర్షి మహోన్నతుడని పలువురు కొనియాడారు. వాల్మీకి జయంతి వేడుకలు శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పుర వీధుల్లో ఊరేగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నంద్యాల పద్మ నగర్‌లో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

- నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగర్‌లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు, వాల్మీకులు నివాళులర్పించారు.
- వెలుగోడు మండలం మోతుకూరు గ్రామంలో వాయిస్ నంద్యాల సంఘం, గ్రామ వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వాయిస్ సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ కొనియాడారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి

- రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని శ్రీశైలం ప్రాజెక్ట్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీరామాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా పోలేరమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. భక్తులతో కలిసి కోలాటాన్ని తిలకించారు.



జూపాడుబంగ్లాలో వాల్మీకి జయంతిలో పాల్గొన్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

- కొత్తపల్లిలోని వాల్మీకి నగర్‌లో పురోహితుడు లక్ష్మీనరసయ్య శర్మ వాల్మీకులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.
- పాములపాడు మండలం లింగాల గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు పిక్కిలి అంబయ్య అన్నదానం చేశారు.



లింగాలలో వాల్మీకి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

- వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంతోపాటు తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

16న ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటన

- ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్

శ్రీశైలంటెంపుల్: ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటించనున్నారని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఏపీ చీఫ్ మాధవ్ తెలిపారు. మంగళవారం శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మాధవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మోదీ శ్రీశైలం పర్యటన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వరం కానుందన్నారు. మల్లన్న దర్శనం, శివాజీ స్ఫూర్తి, ధ్యాన కేంద్రాలను మోదీ సందర్శించనున్నారన్నారు. అనంతరం శ్రీశైలం నుంచి కర్నూలు వెళ్తారని, అక్కడి సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోదీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధికార యంత్రాంగంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయన్నారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో కేంద్రప్రభుత్వం ప్రసాద్ స్కీం పేరుతో రూ.49కోట్లు మంజూరు చేసిందన్నారు. మోదీ ఆధ్వర్యంలో శ్రీశైలం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఉన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ డిప్యూటీ కమర్షియల్ అధికారి సుదర్శన్

బండి ఆత్మకూరు: జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అసిస్టెంట్ డిప్యూటీ కమర్షియల్ ఆఫీసర్ సుదర్శన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై వివరించారు. ఎంఈఓ మోహన్ రెడ్డి, హెచ్ఎం నూర్జహాన్ పాల్గొన్నారు.

- వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మాలిక్ ఖాన్ అధ్యక్షతన జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగముని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు సృష్టించుకోవాలి

నందికొట్కూరు: ఆదాయ వనరులు సృష్టించుకోవాలని మిడుతూరు ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన .. పంచాయతీలు సొంతంగా నిధులు ఏ విధంగా సమకూర్చుకోవాలో వివరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

- కొత్తపల్లి: పన్నులు, సేవా చార్జీలు, అద్దెలు, లీజులు, రుసుములు తదితర వాటి నుంచి ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఎంపీడీఓ మేరి, ట్రైనర్లు పార్థసారథి, చిన్నస్వాములు సూచించారు. కార్యాలయంలో గ్రామాభివృద్ధి కోసం సొంత ఆదాయ వనరులు సమకూర్చుకునే అంశంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.
- పాములపాడు: పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకునే అంశాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదాయ వనరుల సృష్టిపై సర్పంచులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణను డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి ప్రారంభించారు.
- పగిద్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయలంలో స్వీయ ఆదాయ వనరుల కల్పన(ఓన్ సోర్స్ రెవెన్యూ) కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీఓ వీరన్న యాదవ్ పాల్గొన్నారు.

బాలికల మిస్సింగ్

- గంటల వ్యవధిలోనే ఛేదించిన ఆత్మకూరు పోలీసులు



మిస్సింగ్ అయిన బాలికలను చూపుతున్న ఆత్మకూరు సీఐ రాము

ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు మిస్ అయ్యారు. కుటుంబ సభ్యులు ఆందోళనతో పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన పోలీసులు గంటల వ్యవధిలోనే బాలికలను కనిపెట్టి కుటుంబ సభ్యులకు చేర్చారు. వివరాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము వెల్లడించారు. పట్టణంలోని రహమత్ నగర్‌కు చెందిన రాధ సోమవారం ఉదయం 10 గంటలకు బ్యాంకుకు వెళ్లి తిరిగి వచ్చేలోపు తన కూతురు కేదారేశ్వరి, మేనకోడలు మంజుల ఇంటి వద్ద కనిపించక పోవడంతో ఆందోళనతో పోలీసులకు ఫోన్‌లోనే ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలతో ఆత్మకూరు డీఎస్పీ సూచనల మేరకు ఆత్మకూరు పోలీసులు రంగంలోకి దిగారు. ఆత్మకూరు బస్టాండులోని సీసీ కెమెరాలను పరిశీలించి, అనుమానిత వ్యక్తి ఫోన్ లొకేషన్ ఆధారంగా నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండులో తనిఖీ చేశారు. అనంతరం కర్నూలు రైల్వేస్టేషన్‌లో వారు రైలులో డోన్‌కి వెళ్లారన్న అనుమానంతో, డోన్ టౌన్ రైల్వే స్టేషన్‌లో డోన్ సీఐకు తెలియజేసి గాలింపు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాత్రి 11 గంటలకు హైదరాబాద్ బస్టాండులో ఉన్నట్లు గుర్తించి హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆత్మకూరు వాసులను అప్రమత్తం చేశారు. వారిని వెంటనే బస్టాండ్‌కు పంపి, డయల్ 100కి ఫోన్ చేయించి పోలీసుల ద్వారా వారిని పట్టుకుని బస్టాండు అవుట్ పోస్టులో ఉంచారు. వెంటనే ఆత్మకూరు నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళ్లి మిస్సింగ్ అయిన బాలికలను తీసుకుని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి స్టేట్‌మెంట్ రికార్డు చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసిన 10 గంటల వ్యవధిలో బాలికలను గుర్తించి అప్పగించినందుకు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు పోలీసులను జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

బండి ఆత్మకూరు: ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నరసింహ నాయక్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రెండవ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉపాధి కూలీలు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోగలరన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.డేవిడ్, సీఐటీయూ మండల నాయకుడు రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు గడువు 25 వరకు పొడిగింపు

బండి ఆత్మకూరు: ఈపంట నమోదు గడువును ప్రభుత్వం అక్టోబర్ 25 వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏ.కోడూరు, పెద్దదేవలాపురం గ్రామాల్లోని వరి పంటలను ఆయన పరిశీలించారు.

మండలంలో 29,268 ఎకరాల్లో పంటలు సాగు కాగా ఇప్పటివరకు 98 శాతం నమోదు పూర్తయిందని, మిగిలిన రైతులు కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పంటలకు సోకిన తెగుళ్ల నివారణకు జీవ శిలీంద్రనాశకాలైన ట్రైకోడెర్మా విరిడి, ట్రైకోడెర్మా హార్జియానం, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ వంటివి పంటల్లో తెగుళ్లను అరికట్టడానికి ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఏ.కోడూరు గ్రామ రైతులకు జీవ ఎరువులను పంపిణీ చేశారు. జీవ శిలీంద్రనాశకాలు రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు.

జస్టిస్ గవాయిపై దాడి యత్నం హేయమైన చర్య

శ్రీశైలంప్రాజెక్ట్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడి హేయమైన చర్య అని సీపీఐ కార్యదర్శి పులిరాజు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన అడ్వకేట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నివాళి



శంకర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

జూపాడుబంగ్లా: మాజీ మండల ఉపాధ్యక్షుడు, తాటిపాడు గ్రామానికి చెందిన వంగాల శంకర్‌రెడ్డి(75) అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, బైరెడ్డి మల్లికార్జునరెడ్డి తాటిపాడు గ్రామానికి చేరుకుని శంకరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకర్‌రెడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. అలాగే జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు నాగార్జునరెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, పార్టీ మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, పగిద్యాల మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ వై.వెంకటరమణ, కొత్తపల్లి మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తదితరులు శంకర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

ఆశా వర్కర్ల సమస్య పరిష్కరించాలి



డీఎంహెచ్ఓ వెంకటరమణకు వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, విధుల్లో మరణించిన ఆశా కార్యకర్త కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా పరిగణించి పర్మినెంట్ చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, నాగమణి, మంజుల, ఏఐటీయూసీ నాయకులు ఓబులయ్య, వెంకట్, మహేష్, మల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

- జూపాడుబంగ్లా: ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ణ, సీఐటీయూ నాయకుడు రాము డిమాండ్ చేశారు. మంగళవారం పారుమంచాల, జూపాడుబంగ్లా పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను డాక్టర్ ప్రవీణ్, సీహెచ్ఓ గుట్టలయ్యలకు అందజేశారు. ఆశా వర్కర్లు రాణెమ్మ, ప్రమీలమ్మ, విజయమ్మ, నాగలక్ష్మమ్మ, బాలమ్మ, భారతి, లక్ష్మీదేవి, జయమ్మ, మనోహరమ్మ, ఈశ్వరమ్మ, సావిత్రమ్మ, విజయలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.
- ఆత్మకూరు: ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శాంతి, భారతి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వైద్యాధికారికి వినతి పత్రం అందించారు.

వన్యప్రాణులను కాపాడుకోవాలి



బండిఆత్మకూరు మోడల్ స్కూల్‌లో వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహానంది: అంతరించిపోతున్న వన్యప్రాణులకు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చలమ అటవీ సెక్షన్ ఆఫీసర్ విజయవర్ధన్, ఎఫ్‌బీఓ మద్దిలేటిస్వామి అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా మంగళవారం గాజులపల్లె జెడ్పీ పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

- బండి ఆత్మకూరు: స్థానిక మోడల్ హైస్కూల్‌లో వన్యప్రాణి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అటవీ చట్టాల ప్రాధాన్యతను వివరించారు. అడవిలోకి ప్రవేశించడం, చెట్లు నరకడం, వన్యప్రాణులను వేటాడడం, చట్టరీత్యా నేరమని అటవీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు నాగరాజు, కాసీం నాయక్, ఎఫ్‌బీఓ హైమావతి, ప్రసన్న, హెచ్ఎం సయ్యద్ అబ్దుల్ రఫీ పాల్గొన్నారు.
- వెలుగోడు: గుండు మల్లెలమ్మ బేస్ క్యాంపు వద్ద వన్యప్రాణుల వారోత్సవాలను టౌన్ ఫారెస్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వన్యప్రాలను వేటాడటం నేరమని, అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా ఫారెస్ట్‌లోకి ప్రవేశించరాదని ఆయన అవగాహన కల్పించారు.

సంక్షిప్తం

వైద్యం కోసం రోగుల నిరీక్షణ

జూపాడుబంగ్లా: పారుమంచాల ప్రాథమిక వైద్యురాలు సుజాత, వైద్యసిబ్బంది మంగళవారం సకాలంలో విధులకు హాజరుకాకపోవటంతో రోగులు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీ వైద్యులు వారి సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో ఉండగా పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్యం అందించేందుకు జిల్లా వైద్యాధికారులు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లకు చెందిన వైద్యులను పీహెచ్‌సీకి నియమించారు. మిడుతూరు సీహెచ్‌సీ వైద్యురాలు సుజాత 10.30 గంటలైనా ఆసుపత్రికి రాకపోవటంతో రోగులు ఆమె కోసం నిరీక్షించారు. చివరికి ఆమె రావటం లేదని తెలుసుకుని వెనుదిరిగారు.

ఒత్తిడికి లోనుకావద్దు

జూపాడుబంగ్లా: మానసిక ఒత్తిడికి లోనుకావద్దని జిల్లా కెరియర్, మెంటల్ హెల్త్‌కౌన్సిలర్స్ ప్రమీల, నాగన్న విద్యార్థులకు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మోడల్, కేజీబీవీల్లో విద్యార్థులకు మానసిక ఒత్తిడిని ఎలా జయించాలనే విషయమై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ చిన్నమద్దిలేటి, ప్రిన్సిపాల్ రమేష్, ఎస్ఓ యశోద పాల్గొన్నారు.

వార్డు పెంపును వ్యతిరేకిస్తున్నాం

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పెంపు ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వార్డు కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఆత్మకూరు: ఈనెల 11, 12 తేదీలలో పట్టణంలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు మహబూబ్‌బాషా, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్‌లు కోరారు. మంగళవారం వారు ఆర్టీసీ బస్టాండు ఎదుట ప్రచార యాత్రను ప్రారంభించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ఆత్మకూరు: స్థానిక వెంగల్‌రెడ్డి నగర్‌లో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్బన్ కాలనీలో ఉన్న వాల్మీకి విగ్రహానికి వాల్మీకి సోదరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎరక్కపోయి ఇరుక్కుపోయా!



మహానంది: డబ్బాలో నుంచి వచ్చే సువాసనను శునకం పసిగట్టింది. తలను లోపలికి పెట్టి తినే ప్రయత్నం చేసింది. ఇంకేముంది బయటకు తీయలేక కాసేపు కుయ్యోకుయ్యో అంది. గమనించిన 'సాక్షి' చాకచక్యంగా డబ్బాను తీయడంతో బతుకుజీవుడా అనుకుంటూ శునకం పరుగులు తీసింది. ఈ ఘటన మంగళవారం అబ్బీపురంలో చోటుచేసుకుంది.